## ముథోల్‌లో నేడు డిగ్రీ కళాశాల ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన ముథోల్ డిగ్రీ కళాశాల భవనం

**ముథోల్, న్యూస్‌టుడే:** ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న డిగ్రీ కళాశాల ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. మంగళవారం ఎమ్మెల్యే రామారావు పటేల్, కలెక్టర్ అభిలాష అభినవ్ దీన్ని ప్రారంభించనున్నారు. గత సంవత్సరమే డిగ్రీ కళాశాల మంజూరైనా వసతి సదుపాయం లేక ప్రారంభం కాలేదు. నాలుగేళ్ల క్రితం నిర్మించిన గిరిజన గురుకుల పాత భవనాన్ని డిగ్రీ కళాశాలకు కేటాయించడంతో ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ముథోల్ నియోజకవర్గంలో భైంసాలో మాత్రమే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉంది. అది కూడా పట్టణానికి దూరంగా ఉండటంతో చాలా మంది విద్యార్థినులు కళాశాలలో చేరడానికి వెనుకంజ వేశారు. ముథోల్‌లో ప్రారంభం కానున్న డిగ్రీ కళాశాల ముథోల్, తానూరు, బాసర, లోకేశ్వరం మండలాల విద్యార్థులకు అనువుగా ఉంటుంది. ఇక్కడి కళాశాలలో బీఎస్సీ (బీజడ్సీ), బీఎస్సీ (ఎంపీసీ), బీకాం, బీఏ కోర్సులను ఏర్పాటు చేయనున్నారు. 8 మంది తాత్కాలిక అధ్యాపకులు, నలుగురు బోధనేతర సిబ్బందిని నియమించారు. కళాశాల ఏర్పాటుకు స్థానికులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు తోడ్పాటు అందించారు. కళాశాల భవనంలో కనీస వసతులను వీడీసీ సమకూర్చింది. ఎమ్మెల్యే రామారావు పటేల్, మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావుపటేల్, విఠల్‌రెడ్డి సైతం ఇందుకు సహకరించారు.

## పల్లెలకు పంచాయతీ ఎన్నికల సామగ్రి

**కుభీరు:** ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధమవుతోంది. బీసీ గణన ముగియగానే ఎన్నికలు నిర్వహించాలనే లక్ష్యంతో ముందుకెళుతోంది. అందులో భాగంగానే ఇక్కడి మండలపరిషత్తు కార్యాలయానికి రాష్ట్ర ఎన్నికల సంఘం పంపించిన ఎన్నికల సామగ్రిని స్థానిక అధికారులు మండలంలోని గ్రామ పంచాయతీలకు తరలించారు. ప్రభుత్వం సరఫరాచేసిన సామగ్రిని పంచాయతీ కార్యదర్శులకు అందించి భద్రపరుస్తున్నామని ఎంపీఓ మోహన్‌సింగ్ తెలిపారు.

# అవినీతి మత్తు.. ఆదాయం చిత్తు


● ఆబ్కారీ అధికారుల వసూళ్ల పర్వం

ఈటీవీ ఆదిలాబాద్

◆ బేల మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) మద్యం గొలుసు దుకాణం కోసం వేలం నిర్వహించింది. ఏడాదికి రూ. 12 లక్షలతో ఓ వ్యక్తికి దుకాణం దక్కింది. ఈ విషయం తెలిసిన ఓ ఆబ్కారీ అధికారి అక్కడికి వెళ్లారు. తనకు ఏడాదికి రూ.2 లక్షలు ఇవ్వాలని షరతు పెడితే గ్రామస్థులు అంగీకరించలేదు. చివరికి ఆదిలాబాద్‌లోని మద్యం సిండికేట్‌కు చెందిన ఓ ప్రముఖుడి వద్దకు వెళ్లటంతో నెలకు రూ.3 వేల చొప్పున ఏడాదికి రూ.36 వేలు అధికారికి ఇచ్చేలా ఒప్పందం కుదిరింది.



ఇది బోథ్ మండలంలోని ఓ మద్యం గొలుసు దుకాణం. ఇంద్రవెల్లి, ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో కొంతమంది అధికారుల కనుసన్నల్లో గొలుసుకట్టు దుకాణాల నిర్వహణ సాగుతోంది. డబ్బులు ఇవ్వటం ఆలస్యమైతే గుడుంబా, గంజాయి కేసులు నమోదు చేస్తామని భయపెడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఒకటి, రెండుసార్లు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా స్పందన లేదు.




ఉమ్మడి జిల్లాలో 192 మద్యం దుకాణాలతోపాటు మరో 36 బార్ అండ్ రెస్టారెంట్లకు ప్రభుత్వ అనుమతి ఉంది. 12 మున్సిపాలిటీ పరిధిలో అనుమతిస్తున్న దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లను మినహాయిస్తే 1,519 పంచాయతీల పరిధిలో అక్రమ మద్యం దుకాణాలను అధికారుల ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. గ్రామానికి ఒక్కో గొలుసుకట్టు దుకాణాల ద్వారా సగటున నెలకు రూ.5 వేల చొప్పున పరిగణనలోకి తీసుకుంటే నెలకు రూ.75.95 లక్షలు, రెండు దుకాణాలను పరిగణనలోకి తీసుకుంటే రూ.1.50 కోట్లు అక్రమ వసూళ్ల లక్ష్యంగా అధికారుల దందా కొనసాగుతోంది. కింది స్థాయి అధికారులు చేసే దందా ఉన్నతాధికారులకు తెలిసే జరుగుతుందనే ఆరోపణలున్నాయి.




నిర్మల్ జిల్లా బేల్తరోడ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు మహారాష్ట్ర నుంచి వచ్చే అక్రమ మద్యం సరఫరాకు వారధిగా నిలుస్తోంది. మహారాష్ట్రలో ఎన్నికలు ఉన్నందున మన మద్యాన్ని అక్కడికి పంపిస్తూ అక్కడి చౌక మద్యాన్ని మనకు చేరవేసే దందా సాగుతోంది. కొంతమంది ఎంపీల ఆధారాలైతే రాష్ట్రంలోని ఒకరిద్దరు ప్రముఖ నేతల మద్దతు ఉందని చెబుతూ మహారాష్ట్రలోని బోకర్, పాలజ్, ధర్మాబాద్ మీదుగా అడ్డదారులు చూపుతున్నారు. ఫలితంగా మహారాష్ట్ర మద్యంతో మన రాష్ట్ర ఆదాయానికి గండిపడుతుండగా, వ్యక్తిగతంగా ఎంపీలు, ఆబ్కారీ అధికారులకు ఆదాయం చేకూరుతోంది.



ఇది మంచిర్యాల జిల్లా కోటపల్లి పోలీసులు పట్టుకున్న రూ.3 లక్షల విలువ చేసే అక్రమంగా రవాణా చేస్తున్న మద్యం. ఓ బొలెరో, మరో ఆటోలో మహారాష్ట్ర తరలిస్తుండగా పారుపల్లి సమీపంలో పోలీసులు సీజ్ చేశారు. [illegible], ఆసరవెల్లి, ముట్లగూడెం, కోటపల్లి, వేమనపల్లి మీదుగా మద్యం అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కొంతమంది ఆబ్కారీ అధికారులు వ్యక్తిగత లాభాపేక్షతో పని చేస్తుండటం అక్రమాలకు తావిస్తోంది.



బాసరలో ఎరువుల కోసం చెప్పులను వరుసలో పెట్టి కూర్చున్న రైతులు

## ఎరువుల కోసం తిప్పలు

**బాసర(ముథోల్), న్యూస్‌టుడే:** వర్షం కురవడంతో రైతులు యాసంగి పంటగా శనగ వేయడానికి సిద్ధమవుతున్నారు. కానీ విత్తనాలు, ఎరువులు దొరకక ఇబ్బందులు తప్పడం లేదు. బాసర పీఏసీఎస్ గోదాంకు ఎరువులు వచ్చాయని తెలుసుకున్న రైతులు సోమవారం వేకువజామునే వెళ్లారు. సిబ్బంది వచ్చే వరకు వరుసలో నిల్చోలేక తమ చెప్పులను వరుసక్రమంలో ఉంచారు. సిబ్బంది వచ్చి ఉన్న ఎరువులను అందించారు. కొందరి రైతులకు ఎరువులు అందలేదు. వ్యవసాయ అధికారులు సరిపడే ఎరువులను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

# అడ్డుకోకుంటే అనర్థమే

● ఇసుక దోచేందుకు వేలం పాటలు
● స్వర్ణవాగులో యథేచ్ఛగా తవ్వకాలు

నిర్మల్, న్యూస్‌టుడే

ఒకప్పుడు అన్నదాతకు కొంగుబంగారంగా నిలిచిన స్వర్ణ వాగు కొన్నేళ్ల నుంచి ఇసుకాసురుల పాలిట బంగారుబాతుగా మారింది. యథేచ్ఛగా ఇసుక దోచేయడానికి అనధికార టెండర్లు నిర్వహిస్తూ వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. ఏటా తరహాలోనే ఈ సారి స్వర్ణ వాగు నుంచి ఇసుక తోడేందుకు పరీవాహక గ్రామాల్లో అనధికార 'టెండర్లు' మొదలయ్యాయి. తద్వారా వచ్చే ఆదాయంతో గ్రామాల అభివృద్ధి జరుగుతుందని భావిస్తే.. రానున్న రోజుల్లో భూగర్భజలాలు ఎండిపోయి సాగుకు నీరందని పరిస్థితి ఏర్పడుతుంది. పరిస్థితి చేయి దాటకముందే ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

### కొత్తగా కొల్లగొడుతున్నారు

కొట్ల(కె) సమీపంలోని స్వర్ణ వాగులో నిండా నీరుండటంతో ఇసుకాసురులు కొత్త పద్ధతిలో ఇసుక కొల్లగొడుతున్నారు. ట్రాక్టర్ ఇంజిన్ సాయంతో పనిచేసేలా రెండు గిరకలు ఏర్పాటుచేసి వాటికి రెండు తాళ్లు కట్టారు. వీటికి పెద్దపరిమాణంలో ఉన్న ఓ పారను బిగించారు. ఇంజిన్ స్టార్ట్ చేయగానే ఈ తాళ్లు, వాటికి అమర్చిన పార చెరువులో కొంతదూరం వరకు వెళ్తాయి. అక్కడ కాస్త లోతుకు దిగి పార సాయంతో ఇసుకను తోడుకొని వస్తుంది. ఒడ్డుకు వచ్చాక అక్కడున్న వ్యక్తి దాన్ని పక్కకు తీసుకొస్తున్నాడు. ఇలా తీసుకొచ్చిన ఇసుకను అక్కడే జాలిపడుతుండటంతో పెద్దపెద్ద రాళ్లు, పెద్దపరిమాణంలో ఉన్న ఇసుక పక్కకు పోతుంది. సౌండ్‌బాక్సుల్లో ఉపయోగించే పెద్దపెద్ద స్పీకర్లలో ఉండే అయస్కాంతం తీసుకుని పార వెళ్లిన మార్గంలోనే ఓ వ్యక్తి వాగునీటిలోకి వెళ్తున్నాడు. పార ఉన్న దగ్గర ఈ స్పీకర్ల అయస్కాంతం అతుక్కుంటుంది. అలా దాన్ని గుర్తించి మరో తాడుసాయంతో దాన్ని బయటకు తీసుకొస్తున్నారు. వాగులో లభిస్తున్న దొడ్డుఇసుకను సేకరించి అక్కడే జాలీలతో పడుతూ సన్నగా ఉన్న ఇసుకను సేకరించి వాహనాల్లో తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుక ఎంతలేదన్నా రూ.2,500 నుంచి రూ.3 వేల వరకు ధర పలుకుతోంది. ఈ బాగోతంపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా సంబంధిత అధికారులు స్పందించటం లేదు. నామమాత్రపు చర్యలతో సరిపెడుతూ పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.



నిర్మల్ మండలం కొట్ల(కె) సమీపంలో స్వర్ణవాగు నుంచి తాడు సాయంతో ఇసుక తవ్వకాలు

### జరుగుతోంది ఇలా...

ఇసుక తవ్వకాల్లో ఎంత ఆదాయం ఉందో కొద్ది రోజుల క్రితం జరిగిన బహిరంగ వేలాన్ని పరిశీలిస్తే తెలుస్తోంది. నిర్మల్ మండలంలోని ఓ గ్రామంలో ఇసుక తవ్వకాలకు గ్రామస్థులు బహిరంగ వేలం నిర్వహించారు. ఓ ప్రజాప్రతినిధి తన అనుచరుడిని బినామీగా ఏర్పాటు చేసుకుని రూ. 5.40 లక్షలకు ఇసుక తవ్వకాలను దక్కించుకున్నట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. సదరు ప్రజాప్రతినిధి అదే రోజు సాయంత్రం వాగులో పొక్లెయిన్ సాయంతో ఇసుక తవ్వకాలు మొదలు పెట్టడం గమనార్హం. ఇదే మండలంలోని మరో గ్రామంలో, సోన్ మండలంలోని స్వర్ణ, సుద్దవాగు పరీవాహక గ్రామాల్లోనూ బహిరంగ వేలం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది.

### భవిష్యత్తులో ముప్పు...

స్వర్ణవాగు పరిసర ప్రాంతాల నుంచి ఇసుక తరలింపును ఆయా గ్రామాభివృద్ధి కమిటీలు ప్రధాన ఆదాయ వనరుగా ఎంచుకున్నాయి. తమ గ్రామం నుంచి ఇసుక తరలించాలంటే ట్రాక్టరుకు ఇంత రుసుము చెల్లించాలని నిర్ణయించి వీటి వసూలుకు గ్రామంలోనే టెండర్లు వేస్తుంటారు. ఈ టెండర్లలో అధిక ధరకు తీసుకున్న గుత్తేదారు తమ ప్రాంతాల నుంచి ఇసుక తరలించేందుకు ఇటు అధికారులకు, ట్రాక్టరు యజమానులకు వారధిలా ఉండి తన పని తాను చూసుకుంటున్నారు. ఆయా ప్రాంతాలను బట్టి ఒక్కో ట్రాక్టరుకు రూ. 100-200 వసూలు చేస్తున్నారు. అయితే గ్రామ కమిటీలకు ఆదాయం వస్తుందని అనుకున్నా. భవిష్యత్తులో నీటి ముప్పు ఆ గ్రామ ప్రజలే ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయి.

### ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటాం: సంతోష్‌కుమార్, తహసీల్దార్, నిర్మల్ గ్రామీణం

స్వర్ణ వాగు నుంచి ఇసుక తరలిపోకుండా చూస్తాం. ఇసుక తీసుకునేందుకు అనధికార టెండర్లు వేయడం నేరం. ఇలా చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. వెంటనే రెవెన్యూ సిబ్బందిని అక్కడికి పంపించి ఇసుక తవ్వకాలు జరగకుండా చూస్తాం. ఇసుకను తరలిస్తున్న వాహనాలను జప్తు చేయడంతోపాటు ఇసుకను తీసుకెళ్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం.

## క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించండి



సమస్యలు వింటున్న కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, న్యూస్‌టుడే:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి అర్జీలను స్వీకరించారు. దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. శాఖల వారీగా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న అర్జీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదనపు పాలనాధికారి (రెవెన్యూ) కిషోర్‌కుమార్, డీఆర్వో భుజంగ్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### డిజిటల్ సంతకం చేయట్లేదు

నా పేరు ఆకుల శంకర్. ఖానాపూర్ మండలం బాదన్‌కుర్తి గ్రామం. 349 సర్వే నెంబరులో 3.39 ఎకరాల భూమి ఉంది. ఇందులో నా కూతురికి 1.20 ఎకరాలు, మరో వ్యక్తికి 1.37 ఎకరాలు విక్రయించాను. మిగతా 0.22 ఎకరాల భూమికి డిజిటల్ సంతకం పెండింగ్‌లో ఉంది. ఈ సమస్యను పరిష్కరించి ఇవ్వాలని కోరుతున్నా.

### స్థలం కేటాయించండి

ముథోల్ మండలం బోరిగాం గ్రామ శివారులోని సర్వే నెంబరు 249లో 26 ఎకరాల ప్రభుత్వ సలం నుంచి ఒక ఎకరం బుద్ధవిహార్ (లుంబిని వనం) ఏర్పాటుకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు కోరారు.

### చెరువు శిఖం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

దిలావర్‌పూర్ మండలం న్యూ లోలం గ్రామంలోని అంబవాయి కుంట చెరువు శిఖం ఆక్రమణకు గురవుతోంది. ఈ చెరువులోని చేపలు పట్టుకుని 36 గంగపుత్ర కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయి. ఈ శిఖం ఆక్రమణలు జరగకుండా చూడాలని రెవెన్యూ, నీటి పారుదలశాఖ అధికారులు విన్నవించినా పట్టించుకోవడం లేదు. సర్వే చేయించి హద్దులు గుర్తించి ఇవ్వాలని, చెరువు శిఖం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని గంగపుత్రులు విన్నవించారు.



## ప్రతి పోలీసూ ఓ సైనికుడే: ఎస్పీ



కాగడా వెలిగిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

**నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే:** సరిహద్దులో దేశ రక్షణకు పాటుపడుతున్న సైనికులు ఎంత కీలకమో, రాష్ట్ర భద్రతలో పోలీసులూ అంతే కీలకమని జిల్లా పోలీసు అధికారి డా. జి. జానకి షర్మిల అన్నారు. ప్రతీ పోలీసూ ఓ సైనికుడేనన్నారు. పోలీసు అమరువీరుల సంస్మరణ వారోత్సవాల ప్రారంభం నేపథ్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో అమరులవీరుల స్తూపానికి నివాళులర్పించారు. స్మారక కాగడా వెలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సంరక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర ఎనలేనిదని చెప్పారు. అంతర్గత భద్రత కాపాడే పనిలో పోలీసులు ప్రాణాలు సైతం అర్పిస్తున్నారని గుర్తుచేశారు. పోలీసుల పనితీరుపైనే అభివృద్ధి ఆధారపడి ఉంటుందన్నారు. పోలీసు అమరుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలవాలని, వారికి మానసిక బలం అందించడమే నిజమైన నివాళులన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని అమరవీరుల కుటుంబసభ్యులను పరామర్శించారు. జ్ఞాపికలు అందజేశారు. వారితో మాట్లాడి ఇబ్బందులు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదనపు ఎస్పీ సూర్యనారాయణ, భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, డీఎస్పీ గంగారెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యురాలిని ఓదారుస్తూ..

## పాఠశాల ఆకస్మిక తనిఖీ

**ఖానాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని మస్కాపూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఏ-1 పరీక్షలను సోమవారం డీఈఓ రవీందర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచనలు చేశారు. విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా చూసుకోవాలని, పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఉపాధ్యాయులు బోనగిరి నరేందర్, శంకర్, శేఖర్, శ్రీనివాస్, అంజయ్య, ఇమ్రాన్ పాల్గొన్నారు.



మస్కాపూర్‌లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులను పరిశీలిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

## పోషకాహారంపై అవగాహన పెంచాలి

**నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే:** దైనందిన జీవితంలో పోషకాహారం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి డా. రాజేందర్ సూచించారు. ఆయుష్ వైద్యాధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పోషకాహారలోపంతో బాధపడుతున్న, సాధారణ పోషకాహారలోపంతో ఉన్న పిల్లలను గుర్తించాలన్నారు. పౌష్టికాహారస్థాయిని పెంచడానికి, అనారోగ్య సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చైతన్యం కల్గించే కార్యక్రమాలు రూపొందించాలని చెప్పారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమ నిర్వహణాధికారి డా. శ్రీనివాస్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## తైక్వాండో పోటీల రాష్ట్ర పరిశీలకుడిగా ఖానాపూర్ ఉపాధ్యాయుడు



బుచ్చి రామారావు

**ఖానాపూర్, న్యూస్‌టుడే:** ఈ నెల 23 నుంచి 25 వరకు జోగులాంబ గద్వాల జిల్లాలో నిర్వహించనున్న అండర్-17 బాలబాలికల తైక్వాండో పోటీలకు రాష్ట్ర పరిశీలకుడిగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్. బుచ్చిరామారావు నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రాంరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.

రైతేరాజు 6లో



## వామ్మో వానరం..

తరచూ దాడులతో భయాందోళనలో ప్రజలు

**ఖానాపూర్, న్యూస్‌టుడే:** ఖానాపూర్ పట్టణంలో వానర సైన్యం పట్టణ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఇంటి ఆవరణలో మహిళలను ఇంటిపనులను కూడా చేసుకోనివ్వడం లేదు. కాలనీలలో వందల సంఖ్యలో వానరాలు తిరుగుతూ ఇబ్బందులు పెడుతున్నాయి. బెదిరిస్తే మూకుమ్మడిగా దాడులకు పాల్పడుతున్నాయి. ఇళ్ల తలుపులు తెరిచి ఉంచినా, ఆదమరచి ఉన్నా ఇళ్లలోకి చొరబడి అందినకాడికి ఎత్తుకెళ్తున్నాయి. బియ్యం, పప్పులు, సామగ్రి ఏది దొరికితే దానిని పట్టుకెళ్తున్నాయి. వానరాల బాధ భరించలేక ఇంటి ఆవరణలో ఉన్న చెట్లను సైతం నరికేస్తున్నారు. చిన్నపిల్లలు, పెద్దలు, వృద్ధులు అనే తేడాలేకుండా ఇటీవల కోతులు రక్కడం, గాయపర్చడం సర్వసాధారణంగా మారింది. తాజాగా కోతులు తరమడంతో మహిళ ప్రాణాలు కోల్పోయిన సంఘటన చోటుచేసుకోవడంతో పట్టణ ప్రజలు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. కోతుల సంఖ్య భారీగా పెరిగిపోవడంతో వాటిని నియంత్రించేందుకు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇటీవల ఖానాపూర్ పర్యటనకు వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పటికీ రాష్ట్రమంతా ఇదే సమస్య ఉందని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అన్నారు. దీంతో కోతులభయంతో ప్రజలు, చిరు వ్యాపారులు, పాఠశాలలో విద్యార్థులు ఇలా ప్రతీ ఒక్కరూ భయాందోళన చెందుతున్నారు.



విద్యానగర్‌లో ఓ ఇంటిపై వానరాల సమూహం





కుంటాలలో సోయా కుప్పపై కప్పిన టార్పాలిన్ కవరులో నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతు ★ భైంసాలో తడిసిన సోయా సంచులు

## ఇదేం కాలం బాబోయ్..!

**కుంటాల, భైంసా గ్రామీణం, భైంసా, న్యూస్‌టుడే:** పంట ఉత్పత్తులు ఇంటికి చేరే కాలం.. సోయా, మొక్కజొన్న పంట దిగుబడులు కల్లాల్లో మగ్గుతున్నాయి. పత్తితీతకు కూలీల కొరత కారణంగా చేనులోనే ఉండిపోతోంది. మరో వారం రోజుల్లో వరి కోతకు రానుంది. ఇలాంటి క్రమంలో అకాల వాతావరణ పరిస్థితులు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పత్తి నిలువునా తడిసి ముద్దవుతోంది. ఏపుగా పెరిగిన వరి పైరు పలు చోట్ల నేలకొరిగి నష్టం కలిగిస్తోంది. పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడాల్సి వస్తోంది. టార్పాలిన్‌లతో సోయా, మొక్కజొన్నలను కప్పి ఉంచినా కిందినుంచి వర్షపు నీరు ప్రవేశించి దిగుబడులు తడిసినట్లు రైతులు తెలిపారు. కొందరి సోయా సంచులు తడిసి పోయాయి. దీంతో వాటిని మళ్లీ ఆరబెట్టాల్సి వస్తుందని, సంచుల్లోనే ఉంచితే మొలకెత్తుతాయని వాపోయారు. అసలు వానాకాలమా.. చలికాలమా ఇదేం కాలం బాబోయ్ అంటూ రైతుల సంశయంలో ఉన్నారు. అసలే విపణిలో గిట్టుబాటు ధరలు లభించక రైతులు అల్లాడుతున్నారు. తేమ కష్టాలు కొనుగోలు కేంద్రాల్లో తూకానికి ఆటంకంగా మారాయి. కుంటాల, భైంసా మండలాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. కుంటాలలో పిడుగుపాటుకు విద్యుత్తు తీగలు దెబ్బతిని సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సరఫరా పునరుద్ధరించారు. భైంసాలో సంతరోజు కావడంతో కూరగాయలు, ఇతర దినుసులను విక్రయించే వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# సెనగ సాగుకు అనుకూలం

**న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం :** జిల్లా భూములు యాసంగిలో సెనగ సాగుకు లాభదాయకంగా ఉంటాయని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆశించిన దిగుబడులు పొందే వీలుందని అన్నారు. వానాకాలంలో సోయా సాగు చేసిన రైతులు రెండో పంటగా సెనగ సాగు చేసుకుంటే మేలు. ఈ పంట చల్లని వాతావరణంలో పెరుగుతుందని ఆయన తెలిపారు.

### ఇలా విత్తుకోవాలి..



సెనగ పచ్చ పురుగు

ఎకరానికి 20 నుంచి 25 కిలోల విత్తనం అవసరం. ఆలస్యంగా వేసినట్లయితే మరో 20 శాతం అదనంగా వేసుకోవాలి. ఎండుతెగులు ఉంటే విత్తనశుద్ధి చేసుకోవాలి. కిలో విత్తనానికి నాలుగు గ్రాముల ట్రైకోడెర్మా వాడితే మంచి ఫలితం ఉంటుంది. విత్తిన తర్వాత పెండిమిథాలిన్ ఎకరాకు 1.5 లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన 25 రోజులకు గొర్రుతో అంతర పంటలు సాగు చేసుకోవచ్చు. విత్తిన 20 రోజులకు ఒకసారి తిరిగి 30-40 రోజులలో రెండో సారి కలుపుతీయాలి.

రైతేరాజు

### ఎరువులు ఇలా..

నేల స్వభావాన్ని బట్టి నేలలో లభించే పోషకాల మోతాదును బట్టి ఎరువు వాడాలి. చివరి దుక్కిలో ఎకరానికి రెండు టన్నుల పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. ఎకరా సెనగ సాగుకు 8 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి. నేలలో నిల్వలు సరిపడా ఉన్నప్పుడు భాస్వరం, పొటాష్ ఎరువులు వేసే అవసరం లేదు. ఈ ఎరువులను ఆఖరి దుక్కిలో వేయాలి. ఎకరాకు 18 కిలోల యూరియా, 125 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్ లేదా 50 కిలోల డీఏపీని వేసినచో పంటకు కావాల్సిన నత్రజని, భాస్వరం అందుతాయి. భాస్వరం ఎరువును సింగిల్ సూపర్ ఫాస్పేట్ రూపంలో వేసిన పంటకు కావాల్సిన గంధకము కూడా అందుతుంది.



### సస్యరక్షణ

పంటను పచ్చపురుగు ఆశించి నష్టపరుస్తుంది. ఇది విత్తనాలు మొలిచిన 10-15 రోజుల నుండి ఆశించి పంట పరిపక్వదశకు చేరే వరకు ఉండి విపరీతమైన నష్టాన్ని కలిగిస్తుంది. నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి. వేపకషాయాన్ని పిచికారీ చేయాలి.

### విత్తనోత్పత్తి

విత్తనోత్పత్తిగా సాగు చేసే రైతులు సారవంతమైన, మురుగు నీరు నిలవని గత పంట కాలంలో సెనగ పంటను వేయని పొలాన్ని విత్తనోత్పత్తికి ఎన్నుకోవాలి. ఇతర సెనగ పంట పొలాల నుంచి కనీసం 5 మీటర్ల దూరంలో ఉండేలా చూసుకోవాలి. అక్టోబరు - నవంబరు 15లోగా విత్తనాలు విత్తుకోవడానికి అనుకూల సమయం. ఆయా ప్రాంతానికి అనువైన, తెగుళ్లను తట్టుకొని, అధిక దిగుబడిని ఇచ్చే రకాలను ఎన్నుకొని మూల విత్తనాన్ని అధీకృత సంస్థల నుంచి సేకరించి విత్తనోత్పత్తికి వాడాలి. విత్తిన 30-40 రోజుల సమయంలో తేలికపాటి తడి ఇస్తే దిగుబడి పెరిగి నాణ్యమైన విత్తనం లభించే వీలుంది.

## రైతు ప్రశ్న — శాస్త్రవేత్త సమాధానం



**డా. శివకృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి**
**చరవాణి సంఖ్య: 91002 29854**

**?** ప్రస్తుతం కందిని మచ్చల పురుగు ఆశిస్తోంది. నివారణ చర్యలు తెలపండి?
- సత్యనారాయణ, రైతు, తపాల్‌పూర్

✓: మచ్చల పురుగు నివారణకు 2.5 మిల్లీ లీటర్ల క్లోరోపైరిపాస్ లేదా 0.75 మిల్లీలీటర్ల నోవల్యూరాన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉద్ధృతి ఎక్కువగా ఉంటే స్పైనోషాడ్ 0.3 మి.లీ లేదా ఎమామెక్టిన్ బెంజోయేట 0.4మి.లీ, లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.


**?** యాసంగిలో వేయదగిన ఆరుతడి పంటలు ఏవి? -వెంకటేశ్, రైతు, కాసిపేట

✓: పంట మార్పిడి చేసి ఆరుతడి పంటలు వేయడం వల్ల నేల సారవంతంగా మారుతుంది. వేరుసెనగలో కదిరి-6, కదిరి-9, టీఏజీ-24 రకాలు వేసుకుంటే ఎకరానికి 8క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. పెసరలో ఎంజీటీ-295, డబ్ల్యూజీజీ-37, రకాలు 4 క్వింటాళ్లు, నువ్వులలో శ్వేత, హిమ, గౌరి రకాలు ఎకరాలకు 2.5 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తుంది. ప్రస్తుత వానాకాలం పంట పూర్తి కాగానే వీటిని విత్తుకోవచ్చు.

# పాడి.. లాభాలు దండి



స్వాతిరెడ్డి



కజ్జర్లలో ఏర్పాటు చేసిన డెయిరీ ఫాంలో గేదెలు

వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను ఎంపిక చేసుకొని వాటిని నిత్య ఆదాయ మార్గాలుగా మార్చుకోవచ్చని నిరూపిస్తున్నారు తలమడుగు మండలం కజ్జర్లకు చెందిన మహిళా రైతు స్వాతిరెడ్డి. 2020లో కజ్జర్లలో తండ్రి స్వామిరెడ్డి ప్రోత్సాహంతో 20 ముర్రాజాతి గేదెలతో సొంత స్థలంలో డెయిరీఫాం ఏర్పాటు చేసుకున్నారు. నిర్వహణకు ఇద్దరు కూలీలను నియమించారు. పొలంలోనే 2 ఎకరాల స్థలంలో సుఫారీ నేపియర్ గడ్డిని పెంచి ఏడాది పొడవునా గేదెలకు పచ్చిగడ్డి ఉండేలా ఏర్పాట్లు చేసుకున్నారు. పత్తిచెక్క, వరి తవుడు, పెసర చున్నీని దాణాగా పెడుతున్నారు. 2024 నాటికి మరో 30 గేదెలను కొనుగోలు చేసి మొత్తం 50 గేదెలతో డెయిరీ ఫాం నిర్వహిస్తున్నారు. గేదెలు నిత్యం 150 లీటర్ల పాలు ఇస్తుండగా వాటిని ఆదిలాబాద్ పట్టణానికి తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ప్రతి నెలా రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తోంది. కూలీలు, డెయిరీ ఫాం నిర్వహణ ఖర్చులకు రూ.1 లక్ష పోగా.. రూ.2 లక్షల లాభం వస్తోందని ఆమె తెలిపారు. ప్రతి పంట కాలం మొదట్లో పేడ విక్రయం ద్వారా అదనంగా రూ.1 లక్ష ఆదాయం వస్తోందన్నారు. ప్రస్తుతం నలుగురు కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. మార్కెట్‌లో పాల విక్రయం అధికంగా ఉండటంతో ఏటా గేదెల కొనుగోలు చేస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా కష్టపడితే ఆశించిన లాభాలు వస్తాయంటున్నారు.

ఆదర్శం

**మొక్కజొన్నలు పశుగ్రాసంగా..**

మీకు తెలుసా?

చాలా మంది రైతులు మొక్కజొన్న కంకులను ఎరువుగా, వంట చెరకుగా వాడుతున్నారు. ఈ కంకులలో మామూలు పశుగ్రాసాలలో ఉన్నట్లు 3-5 శాతం వరకు మాంసకృత్తులు, 55 శాతం పిండి పదార్థాలున్నాయి. ఈ కంకులను పశువులు నమిలి తినడం కష్టం. అందువల్ల వాటిని ఎండబెట్టి, యంత్రం ద్వారా పొడిగా చేసుకొని పశుగ్రాసాల కొరత సమయాలలో వాడుకోవచ్చు.

# విద్యార్థి భవితవ్యానికి అపార్



**న్యూస్‌టుడే, మంచిర్యాల విద్యావిభాగం :**

**జాతీయ విద్యావిధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది. వన్ నేషన్ వన్ స్టూడెంట్ పేరిట ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కేజీ నుంచి పీజీ వరకు దేశంలోని ప్రతి విద్యార్థికి 12 అంకెలతో కూడిన ఒక ప్రత్యేక ఐడీని అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కేటాయించనున్నారు. ఇది దేశంలో ప్రతి విద్యార్థికి అందించే గుర్తింపు నంబరు. ఆన్‌లైన్ నమోదుకు ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అన్ని జిల్లాల విద్యాశాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.**

ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం జిల్లా వ్యాప్తంగా 4822 ప్రభుత్వ, ప్రైవేటు, గురుకులాలు, ఆదర్శ, కస్తూర్బా పాఠశాలలు కొనసాగుతున్నాయి. 4 లక్షల మందికి పైగా విద్యార్థులు ఆయా మాధ్యమాల తరగతుల్లో చదువుతున్నారు. పిల్లలకు పాఠశాల స్థాయిలో చైల్డ్ ఇన్ఫో ద్వారా ఒక ఐడీ, కళాశాల స్థాయిలో మరో ఐడీ ఉంటుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అందించే అపార్ కార్డులోనే పూర్తి సమాచారం ఉండనుంది. అపార్‌కార్డు ద్వారా కేటాయించే సంఖ్య జీవిత కాలం ఐడీగా పరిగణిస్తారు. ఇందులో విద్యార్థికి సంబంధించిన కేజీ టూ పీజీ వరకు విద్యార్థి పూర్వ వివరాలు, సాధించిన విజయాలు, ఉపకార వేతనాలు, మెమోలు, ధ్రువపత్రాలు ఆధార్ అనుసంధానం ఉండటంతో కుటుంబ వివరాలు అందుబాటులో ఉంటాయి.

### అంగీకారం తప్పనిసరి

కేంద్ర ప్రభుత్వం జారీచేసే ఈ అపార్‌కార్డు వివరాలు పూర్తి గోప్యంగా ఉంటాయి. దీనిని పొందేందుకు తల్లిదండ్రుల అంగీకారం తప్పనిసరిగా తీసుకోవాలని కేంద్ర మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఇటీవల విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జూమ్ మీటింగ్ నిర్వహించి కార్యక్రమం నిర్వహణపై అవగాహన కల్పించారు. గత శనివారం నిర్వహించిన పీటీఎం (పేరెంట్స్ టీచర్స్ మీటింగ్)లో ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులతో దీని గురించి వివరించారు. పాఠశాలల్లో, ఆధార్ కార్డులో వివరాలు ఒకేలా ఉండాలని లేనివారు మార్పులు చేసుకోవాలని సూచించారు. తర్వాత మార్పులకు అవకాశం ఉండదని.. అపార్ ప్రాముఖ్యాన్ని వివరిస్తూ అంగీకార పత్రాలపై అవగాహన కల్పించారు.




అపార్ నమూనా కార్డు

**కార్డులో పొందుపర్చే అంశాలు**

డిజిటల్ కార్డుపై విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు సంఖ్య ఉంటాయి.

### ఉపయోగాలు

- విద్యార్థులు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు మారేటప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుంది.
- అపార్ గుర్తింపుతో డిజీలాకర్‌కు అనుసంధానమవుతారు. విద్యావిషయ విజయాలు, ధ్రువపత్రాలు డిజిటల్ రూపంలో సురక్షితంగా భద్రపరుచుకోవచ్చు.
- విద్యార్థుల ఉపకార వేతనాలు, వారు పొందుతున్న ప్రయోజనాలు, వివిధ విద్యాసంస్థల్లో చేరికలు, మార్పులు, ఉద్యోగాల భర్తీ సమయం ఇతర సందర్భాల్లో సమాచారం అపార్ ఆధారంగా నిర్వహించేలా రూపొందించారు.

### ఒకే ఐడీలో పూర్తి వివరాలు




కేంద్రం ప్రభుత్వం తీసుకొస్తున్న అపార్ కార్డు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడనుంది. ఒకే నంబరులో విద్యార్థికి సంబంధించి పూర్తి వివరాలు నమోదుకానున్నాయి. దీనికి తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇచ్చాం. ఇటీవల తల్లిదండ్రుల సమావేశాల్లో సైతం వారికి వివరించాం.

- ఎస్.యాదయ్య, డీఈవో మంచిర్యాల

# కంది మొక్క.. 12 అడుగులు

మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం జెండా వెంకటాపూర్‌లో కోన ఓదెలు ఇంటి ఆవరణలో ఏపుగా ఎదిగిన కంది మొక్క ఇది. సాధారణంగా కంది మొక్క మూడు నుంచి ఆరు అడుగులు పెరగడం సాధారణం. అలాంటిది వారి ఇంటి ముందు ఉన్న మొక్క 12 అడుగుల మేర పెరిగింది. ఇంటికన్నా ఎక్కువ ఎత్తు పెరిగిన ఆ చెట్టును గ్రామస్థులు ఆశ్చర్యంగా చూస్తున్నారు. దీనిపై బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఇస్లావత్ తిరుపతిను సంప్రదించగా విత్తనాల్లో జన్యుమార్పిడి కారణంగా ఒక్కోసారి మొక్క పెరుగుదల అసాధారణంగా ఉంటుందన్నారు. ఇదే మొక్క నుంచి సేకరించిన విత్తనాలు ఇదే స్థాయిలో ఎదగకపోవచ్చని ఆయన తెలిపారు.



ఏపుగా ఎదిగిన కంది మొక్క వద్ద ఇంటి యజమాని ఓదెలు

- న్యూస్‌టుడే, లక్షెట్టిపేట

# విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

**రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే :** మందమర్రి రెండో జోన్‌కు చెందిన జి.సత్యఅన్వేష్ (21) అనే విద్యార్థి విద్యుదాఘాతంతో సోమవారం మృత్యువాత పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న సత్యఅన్వేష్ సోమవారం సాయంత్రం ఇంట్లో స్నానం చేసి టవల్ తీగపై ఆరవేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే మందమర్రి డిస్పెన్సరీకి.. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆర్కేపీ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మందమర్రి ఎస్సై రాజశేఖర్‌ను సంప్రదించగా ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.



జి.సత్యఅన్వేష్

# పతుల కోసం సతుల పూజలు

## ఘనంగా కర్వాచౌత్ పండగ

**రెబ్బెన, న్యూస్‌టుడే:** సాధారణంగా ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, హరియాణా, మధ్యప్రదేశ్, రాజస్థాన్ తదితర ప్రాంతాల్లో కర్వా చౌత్ పండగను కనులపండువగా నిర్వహిస్తుంటారు. ఏడాదికి ఒకసారి వచ్చే కార్తిక మాసంలోని కృష్ణపక్ష చతుర్థి రోజున ప్రత్యేకంగా వివాహితులైన మహిళలు మాత్రమే దీన్ని ఆచరిస్తుంటారు. ఆ రోజు సూర్యోదయానికి ముందు ఉపవాసం ప్రారంభించి రాత్రి చంద్రుని దర్శనం తర్వాత ముగిస్తారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు రెబ్బెన మండల కేంద్రంలో స్థిరనివాసం ఏర్పర్చుకున్న పలు కుటుంబాలు ఈ పండగను ఘనంగా కొనసాగిస్తుంటారు.

గ్రామీణ ప్రాంత మహిళలే కాకుండా పట్టణాల్లోని వారు కూడా కర్వా చౌత్ ఉపవాసాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో పాటు ఉత్సాహంగా పాటిస్తుంటారు. శాస్త్రాల ప్రకారం కార్తిక మాసంలోని కృష్ణ పక్షంలో చంద్రోదయ చతుర్థి రోజున వ్రతాన్ని ఆచరించాలి. కార్తీక కృష్ణ పక్ష చతుర్థి రోజున కర్కచతుర్థి (కర్వా చౌత్) ఉపవాసం పాటించే సంప్రదాయం ఉంది. భర్తలు ఎల్లప్పుడు యోగక్షేమాలతోపాటు దీర్ఘాయువుగా ఉండాలనే ఉద్దేశంతో సతులు పండగను నిర్వహిస్తారు. ఉదయం 4 గంటల నుంచి ఉపవాసం తీసుకొని కనీసం నీళ్లు కూడా తాగకుండా రాత్రి చంద్రుని దర్శనం కోసం ఎదురు చూస్తారు. బాలచంద్ర గణేష్‌కు పూజలు చేసిన తర్వాత అందరూ కలిసి తులసి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. రాత్రి జల్లెడలో చంద్రుడిని దర్శించుకుని ఆహారం తీసుకోవడంతో ఉపవాసం ముగుస్తుంది.



తులసి చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

# శెభాష్ సంజయ్

**● మూడు మైనింగ్ ఉద్యోగాలకు ఎంపికైన మిట్టపల్లి యువకుడు**



ఐఐటీ ధన్‌బాద్ డైరెక్టర్ రాజీవ్ శేఖర్ నుంచి బంగారు పతకం అందుకుంటున్న రామటెంకి సంజయ్‌కుమార్

**న్యూస్‌టుడే, జైపూర్ :** సాదాసీదా మధ్య తరగతి కుటుంబం వారిది. తండ్రి సింగరేణిలో ఉద్యోగం చేస్తున్నప్పటికి కుటుంబం పెద్దది కావడంతో వారిని పోషించడంలో చాలా కష్టాలను ఎదుర్కొన్నాడు. తనలా తన కుమారుడు కావొద్దని.. తను పనిచేసిన సింగరేణిలోనే అధికారిగా పని చేయాలని ఆయన కలలు కన్నాడు. తండ్రి పడ్డ కష్టం.. తన మీద పెట్టుకున్న ఆశలు మరింత బాధ్యతను పెంచాయి. దీంతో పట్టుబట్టి ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడు ఎగ్జిక్యూటివ్ స్థాయి మైనింగ్ ఉద్యోగాలు సాధించి శెభాష్ అనిపించారు రామటెంకి సంజయ్‌కుమార్.

మిట్టపల్లి గ్రామానికి చెందిన రామటెంకి పోషం-రాజమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. అందరికన్న చిన్నవాడు సంజయ్. తండ్రి చిన్నతనంలోనే సింగరేణిలో ఉద్యోగ విరమణ కావడం... ఆయన ప్రోత్సాహంతో భవిష్యత్తులో తాను సింగరేణి అధికారి కావాలనే లక్ష్యంగా పెట్టుకున్నాడు. దీంతో 2013 ఎంసెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి కొత్తగూడెంలోని కొత్తగూడెం స్కూల్ ఆఫ్‌మైన్స్‌లో ఉత్తమ మార్కులతో బీటెక్ పూర్తి చేశాడు. ఈ క్రమంలో కొంతకాలం జెఎన్‌టీయూలో ఒప్పంద అధ్యాపకుడిగా కూడా పని చేశాడు. అదే క్రమంలో జీవితంలో మరింత సాధించాలనే తపనతో గేట్ పరీక్ష రాసి 2020లో ఐఐటీ ధన్‌బాద్‌లో మైనింగ్‌లో ఎంటెక్ చేసి కాలేజీలో మొదటి ర్యాంకు సాధించి బంగారు పతకం కూడా అందుకున్నాడు. 2022లో మహారత్న కంపెనీ అయిన కోల్ ఇండియాలో అండర్ మేనేజర్‌గా ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం మహారాష్ట్రలోని వెస్ట్రన్ కోల్ ఫీల్డ్ వాణి నార్త్ ఏరియాలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇదే క్రమంలో 2023లో మరో మహారత్న కంపెనీ అయిన నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టీపీసీ)లో ఎగ్జిక్యూటివ్ స్థాయి ఉద్యోగం వచ్చినప్పటికి అందులో చేరలేదు. ఈ ఏడాది జులైలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్) పరీక్షలో ఉత్తమ ప్రతిభ చూపి అండర్ మేనేజర్‌గా ముచ్చటగా మూడో ఉద్యోగం సాధించగా తల్లిదండ్రుల కోరిక మేరకు సింగరేణిలోనే ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించాలని కోరుకుంటున్నాడు సంజయ్.

# ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

**ఉట్నూరు, న్యూస్‌టుడే :** ఏజెన్సీలోని గిరిజనుల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. సోమవారం ఉట్నూరు ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఆదివాసీ గిరిజనులు వారి సమస్యలను వివరించారు. ఉట్నూరు మండలం బోయవాడకు చెందిన శంకర్ తనకు ఉద్యోగం ఇప్పించాలని, కాసిపేట మండలం మాలకెపల్లికి చెందిన ఆత్రం శంకర్ తన ఉన్నత చదువుల కోసం ల్యాప్‌టాప్ మంజూరు చేయాలని కోరారు. ఇచ్చోడ మండలం జల్దాకు చెందిన గణేష్ కిరాణ దుకాణం కోసం రుణం మంజూరు చేయాలని, దహేగాం మండలం దేవులగూడకు చెందిన సోములాల్ తన భూమి పట్టా చేయాలని కోరారు. రెండు పడక గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలతో కూడిన అర్జీలు పలువురు సమర్పించారు. ఏపీఓ వసంత్‌రావు, ఏడీఎంఅండ్‌హెచ్ఓ కుడ్మెత మనోహర్, ఈఈ భీంరావు, ఏవో దామోదర్‌రావు, పీహెచ్ఓ సందీప్‌కుమార్, డీపీఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూరు ఐటీడీఏ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూగుప్తా

# నవంబరు 5 నుంచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

**ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే :** ఉట్నూరు కుమురం భీం ప్రాంగణంలో నవంబరు 5 నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నామని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తెలిపారు. క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. సోమవారం పోటీల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. క్రీడాకారులకు వసతి, అందించాల్సిన భోజన సౌకర్యాలపై చర్చించారు. అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రారంభోత్సవానికి అతిథుల ఆహ్వానపత్రాలు, విద్యుత్తు, వైద్యం, ఆట వస్తువులు సకాలంలో సిద్ధం చేయాలని సూచించారు. ఏపీవో వసంత్‌రావు, ఈఈ భీంరావు, ఉమ్మడి జిల్లాల క్రీడల అధికారులు పాల్గొన్నారు.



### అన్నయ్య ప్రోత్సాహంతో



ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ కాలనీలో అశోక్, వందన దంపతుల కూతురు నిఖిత. డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా ఎంపికయ్యారు. తన అన్నయ్య, ఉపాధ్యాయుడు మంద కిరణ్ అన్ని రకాలుగా ప్రోత్సహించారన్నారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఆన్‌లైన్ యాప్‌తో విలువైన సలహాలు తీసుకున్నామని తెలిపారు. ఇవి ఉద్యోగ సాధనకు ఎంతో ఉపకరించాయని పేర్కొన్నారు.

### మేస్త్రీ పని చేస్తూ



నేరడిగొండకు చెందిన ఇ.గంగాధర్ తల్లిదండ్రులు గంగారాం, పోసాని బీడీ కార్మికులుగా పని చేస్తారు. ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్ సాయంతో డిగ్రీ, కష్టాలు పడుతూనే బీఈడీ పూర్తి చేశారు. వివాహం తర్వాత బతుకుదెరువు కోసం మేస్త్రీగా పని చేయాల్సి వచ్చింది. డీఎస్సీ కోసం బీసీ స్టడీ సర్కిల్‌లో చేరి స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు.

### తల్లిదండ్రులు గర్వపడేలా



తాంసి మండలం కప్పర్ల గ్రామానికి చెందిన నర్సమ్మ, శంకర్‌ల కూతురు జ్ఞాన ప్రగతి. చిన్నప్పటి నుంచే చదువులో చురుగ్గా ఉండేది. స్కూల్ అసిస్టెంట్ తెలుగులో మూడో ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపిక కాగా, భాషా పండితురాలుగా ఆరో ర్యాంకు సాధించారు. క్రమం తప్పకుండా బీసీ స్టడీ సర్కిల్‌కు వెళ్లి తోటి విద్యార్థులతో కలిసి చదువుకున్నారు. తల్లిదండ్రులు గర్వపడేలా ఉద్యోగం సాధించారు.

# ఉచిత శిక్షణ.. ఉద్యోగాల సాధన

## ప్రభుత్వ స్టడీ సర్కిళ్ల ద్వారా 77 మంది ఎంపిక

**ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే:** ప్రభుత్వ స్టడీ సర్కిళ్లు నిరుద్యోగులకు వరంగా మారాయి. ఉద్యోగాల సాధనకు అవసరమైన సదుపాయాలను ఉచితంగా కల్పిస్తున్నాయి. మెరుగైన వసతులుండటం, స్టడీ మెటీరియల్‌ను అందిస్తుండటంతో నిరుద్యోగ యువతలో మార్పు వస్తోంది. సివిల్స్, గ్రూప్స్‌వంటి ఉద్యోగాలతోపాటు అన్ని రకాల ఉద్యోగాలకు సన్నద్ధమయ్యేందుకు శిక్షణ ఇస్తున్నారు. మరికొందరు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు స్టడీ హాళ్లలో సాధన చేస్తున్నారు. వాట్సప్, టెలీగ్రామ్ గ్రూపులను ఏర్పాటు చేసి అభ్యర్థులకు విద్య, ఉద్యోగరంగాలకు సంబంధించిన సమాచారం, ఉద్యోగ ప్రకటనలు చేరవేస్తున్నాయి.

ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల్లో 77 మంది స్టడీ సర్కిళ్లలో సాధన చేసినవారే కావడం గమనార్హం. బీసీ స్టడీ సర్కిల్‌లో సాధన చేసిన వారిలో 51 మంది ఉద్యోగాలు సాధించారు. ఇందులో 34 మంది ఎస్జీటీలుకాగా 17 మంది స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలు పొందారు. ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన వారిలో మొత్తం 26 మందికి ఉద్యోగాలు వచ్చాయి. అందులో ఎస్జీటీ 17 మంది, స్కూల్ అసిస్టెంట్‌కు 9 మంది ఎంపికయ్యారు.



బీసీ స్టడీ సర్కిల్ హాలులో చదువుకుంటున్న యువతులు

### కన్నవారి కల నెరవేర్చారు



ఆదిలాబాద్ పట్టణంలోని భాగ్యనగర్‌లో స్థిరపడ్డ బత్తుల సత్యనారాయణ, సునీతల పెద్ద కూతురు సృష్టి. భీంసరి గ్రామంలోని ఎకరం పొలంలో తల్లిదండ్రులు కష్టపడి ఇద్దరు కూతుళ్లను చదివించారు. సృష్టి బీసీ స్టడీ సర్కిల్‌లో చేరి ఆన్‌లైన్ యాప్‌తో ఉద్యోగ సాధనకు విలువైన చిట్కాలు తెలుసుకున్నారు. ఎస్జీటీగా ఎంపికై తల్లిదండ్రుల కల నెరవేర్చారు.

**మేమున్నాం.. మీకు తోడుగా...**
నిర్మల్ 97053 46693
భైంసా 63099 94649
ఖానాపూర్ 96401 62091


ప్రియదర్శినినగర్‌లో భారీ గుంత ఏర్పడి ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

? నిర్మల్ పట్టణం ప్రియదర్శినినగర్‌లోని నందన డిగ్రీ కళాశాల సమీపంలో రహదారిపై కల్వర్టు గతంలో కుంగిపోయింది. ప్రస్తుతం భారీ గుంతలు ఏర్పడి మరింత ప్రమాదకరంగా మారింది. **- సుదర్శన్, వాహనదారుడు**

✔ నిర్మల్‌లోని గాజులపేట్ బర్కత్‌పుర రోడ్ నం-1లో రహదారి మధ్యలో మురుగు నిలిచి రాకపోకలకు పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. **- కాలనీవాసులు**

? నిర్మల్ పట్టణం గాజులపేట్ బర్కత్‌పుర రోడ్ నం.3లో మసీదుకు వెళ్లే మార్గంలో పలు చోట్ల వీధి దీపాలు వెలగక రాత్రివేళ అంధకారం నెలకొంటోంది. **- స్థానికులు**

✔ కల్వర్టును పరిశీలించి ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేయిస్తాం. త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతాం. మురుగు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటాం. వీధి దీపాలు సిబ్బందితో ఏర్పాటు చేయిస్తాం.
**- సి.వి.ఎన్.రాజు, మున్సిపల్ కమిషనర్, నిర్మల్**

– న్యూస్‌టుడే, నిర్మల్ అర్బన్

# ఉత్సాహంగా పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ పోతారెడ్డి, ప్రిన్సిపల్ రాజ్‌కుమార్


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

**నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే:** విద్యార్థుల్లోని మేధస్సు పెంపునకు పోటీ పరీక్షలు దోహదం చేస్తాయని వక్తలు అన్నారు. సోమవారం నిర్మల్ పట్టణం వాసవి ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలను నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిపారు. విద్యార్థులు ఉత్సాహంగా ఇందులో హాజరయ్యారు. పదో తరగతి చదువుతున్న వి.స్నేహిత ప్రథమ, డి.వాగ్దేవి ద్వితీయ, తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎ.శ్రీనిక తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ ఇప్ప పోతారెడ్డి, కార్యదర్శి నల్ల జగదీశ్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఎం.రాజ్‌కుమార్ ధ్రువపత్రాలు, అవార్డులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు అనీశ్‌కుమార్, సాత్విక, గీత, జాయ్‌సన్, నర్సయ్య, వరలక్ష్మి వ్యవహరించారు.


# మృతదేహంతో ధర్నాకు యత్నం


శవయాత్ర రథం వద్ద పోలీసులు

**ఖానాపూర్, న్యూస్‌టుడే:** కోతులు తరమడంతో ప్రాణాలు కోల్పోయిన బొంగోని లక్ష్మి(58) అంతిమయాత్ర సోమవారం రాత్రి 8 గంటల తర్వాత నిర్వహించారు. ఈ క్రమంలో వివిధ పార్టీల నాయకులు, మృతురాలి బంధువులు విద్యానగర్ ఎన్టీఆర్ చౌక్‌లో శవయాత్ర నిర్వహించే వైకుంఠరథాన్ని రోడ్డుపై ఉంచి ధర్నాకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. సీఐ సైదారావు, ఎస్సై రాహుల్‌గైక్వాడ్ వారిని సముదాయించారు. ఈ సందర్భంగా పోలీసులు, నాయకులకు వాగ్వాదం చోటుచేసుకుంది. ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కోతుల బెడద అధికంగా ఉందని, తమకు నిరసన తెలిపే అవకాశం ఎందుకు ఇవ్వడం లేదని నాయకులు నంది రామయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గంగారావు, అనిల్‌రావు పోలీసులను ప్రశ్నించారు. కోతుల సమస్య అంతటా ఉందని, ఇలా చేయడం సరికాదని చెప్పి పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించేయడంతో శవయాత్ర ముందుకు కదిలింది.

# పద్ధతిగా.. క్రమశిక్షణగా..!


గుంపుగా కలిసి వస్తున్న పక్షులు..


పక్కపక్కనే విద్యుత్తు తీగలపై కూర్చొని..

**నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే:** చిత్రాలు చూస్తుంటే.. ఈ పక్షులకు ఎవరో నిరంతర శిక్షణనిచ్చారేమో, లేకపోతే ఇంత ఒద్దికగా ఎలా ఉంటాయనిపిస్తోంది కదూ. సాయంత్రం వేళల్లో కిలకిలరావాలు చేస్తూ గుంపులుగా అక్కడకు చేరుకోవడం, అక్కడున్న విద్యుత్తుతీగలపై ఎంతో పద్ధతిగా, మరెంతో క్రమశిక్షణగా పక్కపక్కనే కూర్చోవడం, కాసేపయ్యాక మళ్లీ అన్నీ కలిసి అక్కడి నుంచి ఎగిరిపోవడం. . చూసేవారికి ముచ్చటగొలిపే ఈ దృశ్యాలు పట్టణంలోని మినీట్యాంక్ బండ్ సమీపంలో దాదాపు ప్రతి రోజూ కనిపిస్తుంటాయి.

# సమస్యలతో స్వాగతం.. పరిష్కరిస్తే ప్రయోజనం


నిర్వహణ కొరవడి మట్టిమయమైన యార్డు


ప్రారంభం కాని మరుగుదొడ్లు

**సారంగాపూర్, న్యూస్‌టుడే:** సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన పాలకవర్గానికి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. కొన్నేళ్లుగా యార్డులో సమస్యలు తిష్ఠ వేసి ఉన్నాయి. తాత్కాలికమైనవి కొన్నైతే దీర్ఘకాలిక సమస్యలు మరి కొన్ని ఉన్నాయి. నూతన అధ్యక్షుడు అబ్దుల్ హాది, పాలకవర్గ సభ్యులు కాసింత దృష్టిసారిస్తే మార్కెట్ యార్డు నూతన శోభను సంతరించుకోనుంది. ఇదే సమయంలో యార్డుకు వచ్చే రైతులకు సౌకర్యాలు మెరుగు పడనున్నాయి. యార్డు పరిధిలో సుమారు 15 వీధి దీపాలున్నా పనిచేయడంలేదు. నిర్వహణ లేక యార్డులో పిచ్చిమొక్కలు పెరిగాయి. రైతుల అవసరాలకు దశాబ్దం కిందట యార్డులో లక్ష లీటర్ల నీళ్ల ట్యాంకు నిర్మించారు. దానికి అనుసంధానంగా అంతే సామర్థ్యంతో సంపు ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు వాటిని వినియోగంలోకి తీసుకురాలేదు. అగ్ని ప్రమాదాలు జరిగితే అత్యవసరంగా ట్యాంకు నీటిని వినియోగించుకునే అవకాశమున్నా పైపులైన్లు లేకపోవడం సేవలకు అవరోధంగా మారింది. కర్షకుల కోసం నిర్మించిన మరుగుదొడ్లు ప్రారంభానికి కూడా నోచుకోలేదు. వినియోగించకుండానే మరుగున పడిపోయాయి. మార్కెట్ యార్డు సమస్యలపై నూతన పాలకవర్గం ప్రత్యేక దృష్టిసారించి పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

## స్పందనకు వందనం
# సమస్యల పరిష్కారానికి చర్యలు

**భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని హస్గుల్‌లో వివిధ సమస్యలు తిష్ఠ వేశాయి. వాటిపై 'ఈనాడు'లో ఈ నెల 18న 'సమస్యలు కోకొల్లలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి, కార్యదర్శి గంగన్న సోమవారం సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లపొదలను, శ్మశాన వాటిక, అంతర్గత రహదారుల పక్కన దట్టంగా పెరిగిన మొక్కలను పొక్లెయిన్‌తో తొలగించారు.


హస్గుల్‌లో చెట్ల పొదలను తొలగిస్తున్న పొక్లెయిన్

# అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే

**లోకేశ్వరం, న్యూస్‌టుడే:** తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన ప్రజలకు తన పదవీకాలం పూర్తయ్యే వరకు అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. సోమవారం లోకేశ్వరంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 124 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం నర్సింహనగర్ తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోతీరాం, డీటీ రవీందర్, ఆర్ఐ బాలకిషన్, పీఏసీఎస్ అధ్యక్షుడు రత్నాకర్‌రావు, నాయకులు రాజేశ్‌బాబు, రవీందర్‌రావు, శ్రీధర్, గంగారెడ్డి, భూమన్న, శంకర్‌గౌడ్, లక్ష్మణ్‌రావు, గంగాధర్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దళారులకు విక్రయించి మోసపోవద్దు

**ముథోల్:** పంట ఉత్పత్తులను దళారులకు విక్రయించి మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తోందని ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం రైతులు పలు సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు సాయిరాం, డైరెక్టర్ సుదర్శన్, పీఏసీఎస్ సీఈఓ సాయారెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, నాయకులు నర్సాగౌడ్, నిమ్మపోతన్న, దత్తు, రాంచందర్, పోతన్న, సాయినాథ్ పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లా


అగ్ని ప్రమాద గదిని పరిశీలిస్తున్న మాజీ మంత్రి అల్లోల

**నిర్మల్, న్యూస్‌టుడే:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో షార్ట్‌సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాద విషయాన్ని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లానని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చెప్పారు. సోమవారం ఆసుపత్రిని సందర్శించి అగ్ని ప్రమాదం జరిగిన గదిని పరిశీలించారు.

**తానూరు(భైంసా):** తానూరు మండల తొలి ఎంపీపీ గంగాధర్‌రావు పటేల్ ఇటీవల మృతి చెందగా మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం సింగన్‌గావ్‌లోని ఆయన కుటుంబీకులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి, నాయకులు బాశెట్టి రాజన్న, పోతారెడ్డి, అబ్దుల్‌గని, బాలాజీ సుధాకర్ తదితరులు ఉన్నారు.

## ఏజెంట్ల నిరసన ప్రదర్శన

**నిర్మల్ పట్టణం:** డిమాండ్ల సాధనకు ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం ఆధ్వర్యంలో స్థానిక మంజులాపూర్‌లోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పాలసీదారుల సమ్ అష్యూర్డ్ (ఎస్ఏ) రూ.2 లక్షలకు పెంచడం వల్ల పేద, మధ్యతరగతి వారికి పాలసీలు అందుబాటులో లేకుండా పోతాయన్నారు. సంఘ బాధ్యులు గాండ్ల నారాయణ, పుప్పాల భాస్కర్, వినోద్‌కుమార్, గంగాధర్, శ్రీనివాస్, గణపతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మున్నూరుకాపు సంఘ కార్యవర్గం ఎన్నిక

**నిర్మల్, నిర్మల్ పట్టణం:** పట్టణంలోని ఏఎన్‌రెడ్డి కాలనీ, శ్రీనగర్‌కాలనీ, దివ్యనగర్, దత్తాత్రేయనగర్ కాలనీలకు సంబంధించిన అయ్యప్ప మున్నూరుకాపు సంఘ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవాధ్యక్షుడిగా సముందర్‌పల్లి కిషన్, అధ్యక్షుడిగా నాలం మదన్‌మోహన్, ఉపాధ్యక్షులుగా తుల గంగాప్రసాద్, అనుముల మధుకర్, ప్రధాన కార్యదర్శిగా కొండ శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శిగా కోడె సాయినాథ్, సహాయ కార్యదర్శులుగా అంగ చంద్రశేఖర్, ద్యావరశెట్టి వేణుగోపాల్, నిర్వహణ కార్యదర్శిగా వద్యాల గణేశ్ ఎంపికయ్యారు.

## సభను జయప్రదం చేయండి

**నిర్మల్ అర్బన్:** విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తున్న పీడీఎస్‌యూ అర్ధ శతాబ్దోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సింగరి వెంకటేశ్ కోరారు. సోమవారం నిర్మల్‌లో గోడప్రతులు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 24న ఉస్మానియా యూనివర్సిటీలో ఈ వేడుకలు జరగనున్నాయని చెప్పారు. నాయకులు హర్షవర్ధన్, ఎస్.కె.రహన్, నవనీత్, గణేశ్ పాల్గొన్నారు.

# ఎలుక బెదురు.. పంట అదురు



ఆరుగాలం శ్రమించి సాగుచేసిన వరి పంటలో గొలుసులు వచ్చే సమయంలో ఎలుకలు వరి పంటను నాశనం చేస్తుంటాయి. ఎలుకల నివారణకు రైతులు అనేక పద్ధతులను అవలంబిస్తుంటారు. అయితే నిర్మల్ మండలం కౌట్ల రైతులు మాత్రం పూర్వీకుల పద్ధతిలో గడ్డి గిద్దలతో పంటలను రక్షించుకుంటున్నారు. వరిగడ్డిని నానబెట్టి కర్రకు చుట్టి వరిపొలంలో అక్కడక్కడ పాతిపెట్టడం వల్ల ఎలుకలు రావని, తద్వారా పంటను రక్షించుకోవచ్చని రైతులు తెలిపారు. కౌట్ల గ్రామ పరిసరాల్లోని పంట పొలాల్లో ఇలాంటి గిద్దెలు కనిపించాయి. **చిత్రం: న్యూస్‌టుడే, నిర్మల్**

# ఓటు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలి


లీడ్ బ్యాంకు మేనేజరు రాంగోపాల్‌కు పురస్కారం అందజేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో అర్హులైన వారు తమ పేర్లు నమోదు చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుపై జిల్లాల కలెక్టర్లు, అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఓటరు నమోదుపై పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా పాలనాధికారి వివిధ శాఖల జిల్లా అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి అధికారి బాధ్యతగా ఎమ్మెల్సీ ఎన్నికల ఎన్నికల ఓటరు జాబితాలో అర్హులైన వారి పేర్లు నమోదు చేయించాలన్నారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్వో భుజంగ్‌రావు, డీఆర్డీవో విజయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## లీడ్ బ్యాంకు మేనేజరుకు అభినందన

**నిర్మల్, న్యూస్‌టుడే:** అటల్ పెన్షన్ యోజన కింద ఈ ఏడాది జులై, ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో జిల్లాలోని అన్ని బ్యాంకుల ద్వారా 2 వేలకుపైగా దరఖాస్తులు స్వీకరించి లక్ష్యాన్ని సాధించినందుకు కేంద్ర ప్రభుత్వ పీఎఫ్ఆర్‌డీఏ అందజేసిన అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్ పురస్కారాన్ని సోమవారం కలెక్టరేట్‌లో లీడ్ బ్యాంకు మేనేజరు రాంగోపాల్‌కు కలెక్టర్ అభిలాష అభినవ్ అందజేశారు. లక్ష్యాలు సాధించడానికి కృషిచేసిన లీడ్ బ్యాంకు మేనేజరును అభినందించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరేలా మరింత ఉత్సాహంతో పనిచేసి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన మస్కాపూర్ వీడీసీ

**ఖానాపూర్ గ్రామీణం:** మండలంలోని మస్కాపూర్ ఉన్నత పాఠశాలకు ఏడుగురు నూతన ఉపాధ్యాయులను కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి కలెక్టరేట్‌లో ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. పాఠశాలకు కావాల్సిన మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ చెప్పారని వారు పేర్కొన్నారు. వీడీసీ సభ్యులు భీమన్న, దయానంద్, రాజారెడ్డి, గజేందర్, మహిపాల్, వెంకట్రాములు, శివ పాల్గొన్నారు.

## అబుల్ కలాం జయంతిని అధికారికంగా నిర్వహించాలని వినతి

**నిర్మల్:** స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ కలాంగుణం ఎడ్యుకేషనల్, యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందజేశారు. సొసైటీ ఆధ్వర్యంలో నవంబరు 1 నుంచి 11 వరకు ఆయన జయంతి కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మొహమ్మద్ ఉస్మాన్, ఉపాధ్యక్షుడు సయ్యద్ చాంద్ పాషా, ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఇంతియాజ్, సంయుక్త కార్యదర్శి జుబేర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## సభ్యుల ప్రమాణ స్వీకారం

**సారంగాపూర్:** సారంగాపూర్ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులుగా సోమవారం కొత్తకాపు పోతారెడ్డి, అహ్మద్ ముక్తార్‌లు ప్రమాణస్వీకారం చేశారు. మార్కెట్ ఛైర్మన్ అబ్దుల్ హాది సమక్షంలో కార్యదర్శి దూమడ నాయక్ నూతన డైరెక్టర్లతో ప్రమాణం చేయించారు. వివిధ కారణాలతో ఇటీవల జరిగిన పాలకవర్గ ప్రమాణస్వీకారానికి వీరిద్దరు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ లక్కడి శంకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సాక్‌పెల్లి సురేందర్, బట్టు భోజన్న, షేక్ షఫి, రాందాస్ పాల్గొన్నారు.

## గ్రామసభ

**భైంసా గ్రామీణం:** ఉపాధిహామీ పథకం పనుల ఎంపిక కోసం మండలంలోని మహాగాంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. పలు పనులను ఎంపిక చేసి తీర్మానించారు.

## జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

**ఖానాపూర్ గ్రామీణం:** మండలంలోని పాత ఎల్లాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎ.అన్వేష్ జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ఎ.రమాదేవి, వ్యాయామ ఉపాధ్యాయుడు నచేందర్ తెలిపారు. ఇటీవల లక్ష్మణచాందలో నిర్వహించిన ఎంపిక పోటీలలో అన్వేష్ ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

## లింగాపూర్ విద్యార్థుల ప్రతిభ

**కడెం:** జిల్లాస్థాయిలో జరిగిన కళోత్సవం-2024లో లింగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నృత్యం, పాటలు, పెయింటింగ్, డ్రాయింగ్, కథల విభాగాలలో బహుమతులు అందుకున్నారు.


పెంబి: కానిస్టేబుల్ శేషయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి, పెంబి ఎస్సై సాయికుమార్, పోలీసులు

# పోలీసు అమరులకు నివాళి

**ఖానాపూర్:** విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. ఖానాపూర్ ఠాణాలో సోమవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని పూలతో నివాళులర్పించారు.

**పెంబి:** పెంబి ఎస్సై సాయికుమార్ తండ్రి ఏఆర్ కానిస్టేబుల్ శేషయ్య 1998 మే 28న బెల్లంపల్లిలో మావోయిస్టుల కాల్పుల్లో మరణించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పెంబి ఠాణాలో శేషయ్య చిత్రపటానికి డీఎస్పీ గంగారెడ్డి నివాళులర్పించారు. భర్త విధి నిర్వహణలో అమరుడైనా ఎన్నో కష్టాలు ఎదుర్కొని తన కుమారుడిని ఎస్సైగా తీర్చిదిద్దిన సాయికుమార్ తల్లి శోభారాణిని అభినందించారు.

**పెంబి:** బాధ్యతగా విధులను క్రమశిక్షణతో నిర్వహించాలని డీఎస్పీ గంగారెడ్డి సూచించారు. సోమవారం పెంబి ఠాణాలో ఖానాపూర్ సర్కిల్ ఎస్సైలతో సమావేశం నిర్వహించారు. ఆయా ఠాణాల్లోని నేరాలు, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఠాణాకు వచ్చిన బాధితులకు అండగా ఉంటూ, సత్వర న్యాయం చేస్తామనే నమ్మకం, భరోసా కలిగించాలని సూచించారు. సీఐ సైదారావు, ఎస్సైలు శంకర్, సాయికుమార్, కృష్ణసాగర్, రాహుల్‌గైక్వాడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భీమన్న జాతర

**మామడ:** మండలంలోని కొరటికల్ భీమన్న దేవుని జాతర సోమవారం ఘనంగా జరిగింది. వివిధ గ్రామాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం భారీ వర్షం పడడంతో ఆలయ ఆవరణలోని దుకాణదారులు, భక్తులు ఇబ్బంది పడ్డారు. పలువురు నాయకులు దేవున్ని దర్శించుకున్నారు.



# సంక్షిప్తం

## నిరుద్యోగులకు ఉచిత ఉపాధి శిక్షణ

**భైంసా:** నిరుద్యోగ యువకులకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) ద్వారా ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా న్యాక్ బాధ్యుడు ద్యావంత్ రమేశ్ తెలిపారు. ఎలక్ట్రీషియన్, ల్యాండ్ సర్వేలో మూడు నెలల శిక్షణతో పాటు ఉచిత భోజన, స్టేషనరీ, వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల నిరుద్యోగులు ఈ నెల 24 వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 98665 65756 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

## జీవో నం.29 రద్దు చేయాలి

**పెంబి:** ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఇబ్బందికరంగా మారిన జీవో నం.29ను తక్షణమే రద్దు చేసి పాత జీవో నం.55ను పునరుద్ధరించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్‌నాయక్, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పెంబి, మందపల్లి, ఇటిక్యాల పాఠశాలల్లో ఉపాధ్యాయ సంఘం సభ్యత నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

## కార్యకర్తలకు పార్టీ అండ

**దిలావర్‌పూర్:** పార్టీ అభ్యున్నతికి కృషి చేసిన కార్యకర్తలకు కాంగ్రెస్ ఆపదలో అండగా ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. ఇటీవల మండలంలోని బన్నపల్లిలో పార్టీ కార్యకర్త మేకల నరేష్ సతీమణి అనారోగ్యంతో మృతి చెందడంతో సోమవారం పరామర్శించారు.

## ప్రభుత్వ భూమికి హద్దులు నిర్ణయించాలని వినతి

**కడెం:** మండలంలోని ధర్మాజీపేట శివారులో ఉన్న సర్వే నెం.214/57, 29లో గల ప్రభుత్వ భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని కోరుతూ గ్రామస్థులు సోమవారం తహసీల్దార్ సుజాతరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు.

## వానరానికి అంత్యక్రియలు

**ముథోల్:** ముథోల్‌లోని కంటి ఆసుపత్రి సమీపంలో సోమవారం విద్యుదాఘాతానికి గురై ఓ వానరం మృతి చెందింది. ఆసుపత్రి పక్కన ఇంటి నిర్మాణం చేపడుతున్న తాపీ మేస్త్రీలు వానరానికి అంత్యక్రియలను నిర్వహించారు.

## ఉత్తర్వుల ప్రతి అందజేత

**నర్సాపూర్ (జి):** మండలంలోని చాక్‌పల్లి గ్రామ ఈద్గా ప్రహరీ నిర్మాణానికి రూ.1,50,000, బూర్గుపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1,50,000 మంజూరు ఉత్తర్వుల ప్రతులను ఆయా గ్రామస్థులకు మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తన నివాసంలో సోమవారం అందజేశారు. మాజీ సర్పంచి మక్బూల్, ప్రవీణ్, మాజిద్ , భూమేశ్, సాయిలు ఉన్నారు.

## మంత్రికి చిత్రపటం...

**నిర్మల్ అర్బన్:** నిర్మల్‌కు చెందిన కళాకారుడు శ్రీనివాస్ ఎంబ్రాయిడింగ్ చేసిన చిత్రపటాన్ని మంత్రి శ్రీధర్‌బాబుకు అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లో కలిసి మంత్రి తండ్రి దివంగత శ్రీపాదరావు చిత్రపటాన్ని రంగురంగుల దారాలతో ఎంబ్రాయిడింగ్ చేసి ఇచ్చారు.

## విధులు పారదర్శకంగా నిర్వహించాలి

**భైంసా గ్రామీణం:** పంచాయతీ సిబ్బంది విధులు పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కామోల్ పంచాయతీని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నివేదికలను పరిశీలించి పని తీరు మెరుగుపర్చుకోవాలని ఆదేశించారు. కార్యదర్శి శివానంద్, సిబ్బంది, తదితరులున్నారు.

## పొన్కల్ పశువైద్యాధికారిగా శహియార్

**మామడ:** మండలంలోని పొన్కల్ పశువైద్యాధికారిగా మహ్మద్ అబ్దుల్ శహియార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా విధుల్లో చేరిన అధికారిని గ్రామస్థులు సన్మానించారు.

## దస్తూరాబాద్ పశువైద్యాధికారిణిగా సంధ్యారాణి

**దస్తూరాబాద్:** దస్తూరాబాద్ పశువైద్యాధికారిణిగా సంధ్యారాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. పశువైద్య సహాయకుడు దేవిదాస్, సిబ్బంది ఉన్నారు.

## బాధితుడికి న్యాయం చేయాలి

**నిర్మల్ అర్బన్:** నిర్మల్ పట్టణానికి చెందిన సాయికిరణ్‌కు న్యాయం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. సోమవారం నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపి మాట్లాడారు. కుటుంబ ఆస్తి పంపకం విషయంలో జరిగిన అన్యాయంపై బాధితుడు, ఆయన భార్య, పిల్లలు దీక్ష చేస్తున్నారని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్, బొమ్మెన సురేశ్, వ్యకాసం నాయకుడు గైని మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగావకాశం కల్పించాలని వినతి

**కుంటాల:** కుంటాల జూనియర్ కళాశాలలో కొన్ని నెలలుగా ఉచితంగా బోధిస్తున్న తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరుతూ విద్యావంతుడు తెడ్డు రమేష్ ప్రజావాణిలో తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు.

## ఇంకుడు గుంతలను నిర్మించాలి

**సోన్:** ఇళ్లు, వీధుల్లో ఇంకుడుగుంతల నిర్మించి భూగర్భ జలాలను సంరక్షించాలని డీపీఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని న్యూవెల్మల్, బొప్పారం గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఎంపీడీఓ సురేష్, ఎంపీఓ కలీల్ హైమద్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ, ఏఈ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పట్టించుకోని కేంద్రం

**నిర్మల్ అర్బన్:** కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌ఛార్జి ఎస్.విలాస్ అన్నారు. సోమవారం నిర్మల్‌లో నిర్వహించిన ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 31న నిర్వహించనున్న యూనియన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. నవంబరు 10న చేపట్టబోయే శిక్షణ తరగతులకు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. నాయకులు శ్రీనివాసచారి, జాదవ్ శంకర్, ఎల్.ఆర్.ఉపాలి, పద్మకుమారి, భుక్య రమేశ్, పుండలిక్ తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ పైపులైన్ పగిలి నీరు వృథా


పాత ఎల్లాపూర్‌లో పైపులైను పగిలి వృథాగా పోతున్న నీరు

**ఖానాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని పాత ఎల్లాపూర్, కొత్తపేట్ గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులు పగిలి నీరు వృథాగా పోతోంది. ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారుల పక్కనే ఉన్న పైపులైన్ పగలడంతో నీరు రహదారిపై వచ్చి చేరుతుండటంతో స్థానికులు ఆ నీటిని మురుగు కాలువలోకి మళ్లించారు. అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.